ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 12
సంచిక : 76
పేజీలు : 3
మంగళవారం, అక్టోబర్ 28, 2025
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## ప్రశాంతంగా ముగిసిన మద్యం దుకాణాల డ్రా

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**టీ మీడియా,అక్టోబర్ 27, భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లాలో నూతన మద్యం దుకాణాల లైసెన్సుల కేటాయింపు కోసం నిర్వహించిన డ్రా కార్యక్రమం సోమవారం ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను పూర్తిగా అనుసరించి, మద్యం దుకాణాల లైసెన్సుల కేటాయింపు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా మరియు నిష్పక్షపాతంగా

మిగతా 2లో

# వర్షాలతో పంట నష్టం వాటిల్లకుండా జాగ్రత్త

**-మంత్రులు ఉత్తమ్, తుమ్మల**
**- 2 రోజుల పాటు తుఫాను**



**టీ మీడియా,అక్టోబర్ 27, ఖమ్మం:**తుఫాన్ కారణంగా కురిసే అకాల వర్షాలతో పంట నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం హైదరాబాద్ నుంచి పత్తి, ధాన్యం, మొక్క వంటి పంటల కొనుగోలుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఇతర రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ వీడియో సమావేశంలో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూలి రాబోయే 2 రోజుల పాటు తుఫాన్ ప్రభావంతో మన రాష్ట్రంలో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని, జిల్లాలో ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాల వద్ద వర్షాల కారణంగా ఎటువంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు పాటిస్తూ చర్యలు తీసుకోవాలని అన్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలని అన్నారు. నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం వంద శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఓపెన్ చేయాలని మంత్రి కలెక్టర్ లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో మౌళిక వసతుల కొరత ఎక్కడైనా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. రైతులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా సజావుగా కొనుగోలు జరిగేలా చూడాలని అన్నారు. పంట కొనుగోలు ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలు, వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు సివిల్ సప్లై కమీషనర్ దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. పంట కొనుగోలు విషయంలో చిన్న తప్పు, అక్రమాలకు కూడా ఆస్కారం లేదని, ఎవరైనా సరే కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో రాబోయే 2 రోజుల పాటు తూర్పు తెలంగాణ ప్రాంతంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున పంట కోతలు వాయిదా వేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కోతలు చేసిన మొక్కజొన్న, వరి వంటి పంటలు నాణ్యతా ప్రమాణాలు ఉంటే వెంటనే కాంటా వేసి కొనుగోలు చేయాలని, పంట తరలింపుకు

మిగతా 3లో

# ఫలించిన మంత్రి తుమ్మల కృషి

- **ఖమ్మం నగరానికి రూ.200 కోట్లు**
- **లకారం నుంచి నీటి సరఫరా**

**టీ మీడియా,అక్టోబర్ 27,ఖమ్మం:**అపర భగీరథుడు వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు కృషి ఫలించింది. ఖమ్మం నగర ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఆయన సంకల్పంకు అడుగులు పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం నగరానికి సురక్షితమైన తాగునీరు అందించేందుకు శాశ్వత పరిష్కారం కోసం రూ. 200 కోట్ల నిధులను విడుదల చేసింది.

మిగతా 3లో









## టీ మీడియా వార్తకు స్పందన

### విగ్రహాలపై ముసుగులు తొలగింపు

**టీ మీడియా,అక్టోబర్27, సింగరేణి (కారేపల్లి):**సింగరేణి మండలంలోని గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలపై ఎన్నికల కోడ్ వాయిదా పడినా ఇంకా ముసుగులు అలాగే ఉన్నాయన్న విషయం టీ మీడియా ప్రత్యేక కథనంగా(ఎన్నికల కోడ్ రద్దయిన) ప్రచురించిన వెంటనే, అధికారులు అప్రమత్తమయ్యారు. స్థానిక ప్రజల్లో చర్చకు దారితీసిన ఈ అంశంపై వెంటనే చర్యలు ప్రారంభించి, ముసుగులను తొలగించే పనిని పూర్తి చేశారు.తహసీల్దార్, పంచాయతీ అధికారి, గ్రామ సెక్రటరీలు సంయుక్తంగా పర్యటించి, అన్ని గ్రామాల్లోని రాజకీయ నాయకుల విగ్రహాలపై ఉన్న ముసుగులను తొలగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ టి మీడియాద్వారా విషయం మా దృష్టికి వచ్చింది. వెంటనే చర్యలు తీసుకుని ముసుగులు తొలగించాం. ఇకపై ఇలాంటి నిర్లక్ష్యానికి చోటు ఉండదు అని తెలిపారు.గ్రామ ప్రజలు టీ మీడియా వార్తతో సమస్య పరిష్కారమవడంతోలి సంతోషం వ్యక్తం చేశారు. టీ మీడియా వార్త వెలువడకపోయి ఉంటే అధికారులు కదిలేవారు కాదు. ప్రజా సమస్యలను ప్రతిధ్వనించే టీ మీడియా ఉన్నంతవరకు మాకు న్యాయం జరుగుతుంది అని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఎన్నికల కోడ్ ఎత్తివేత తర్వాత కూడా ముసుగులు అలాగే ఉండటంతో మొదలైన చర్చ %-% టీ మీడియా వార్త తర్వాత అధికారుల స్పందన విగ్రహాలకు వెలుగులు తిరిగి వచ్చాయి.

# గంజాయి విక్రేతలు అరెస్టు

**టీ మీడియా,అక్టోబర్ 27,ములుగు బ్యూరో :**ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని నూగూర్ పరిసర ప్రాంతంలో గంజాయి తరలిస్తున్న వ్యక్తులను వెంకటాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 14.213 కేజీల గంజాయి ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కె తిరుపతి రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నాడు మధ్యాహ్నం 1:00 గంట సమయంలో ఆరుగురు వ్యక్తులు, మూడు మోటార్ సైకిల్ లపై ప్రభుత్వ నిర్దేశంమూడు మోటార్ సైకిల్ లపై ప్రభుత్వ నిషేధితగంజాయిని భద్రాచలం వైపు నుండి వెంకటాపురం మీదుగా ములుగు తరలిస్తున్నట్లు ఎస్సై కె తిరుపతి రావు కి అందిన సమాచారం మేరకు తనిఖీ నిర్వహించారు.వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా, 5:00 గంటల సమయంలో వెంకటాపురం నుండి ఏటూరునాగారం వైపుకు ఆరుగురు వ్యక్తులు, మూడు మోటార్ సైకిళ్ళు రావడం గమనించారు. ఎస్సై కె తిరుపతి రావు పోలీస్ సిబ్బంది తో ఒక్కసారిగా రోడ్డు పైకి వచ్చి వారిని అపుటకు ప్రయటించారు. వారిలో ముందు ఉన్న మోటార్ సైకిళ్లపై ఉన్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. వెనకాల ఉన్న మోటార్ సైకిళ్లపై ఉన్న వ్యక్తులు పోలీస్ వారిని గమనించి బైక్ తిప్పుతూ స్కిడ్ అయి కింద పడి వారి వద్ద ఉన్న బ్యాగ్ని, బైక్ తో సహా వదలి అడవి లోకి పారిపోయారు. మూడవ మోటార్ సైకిల్ పై ఉన్న ఇద్దరు వ్యక్తులు కూడా వెనకాల తిప్పుకొని తన వద్ద ఉన్న బ్యాగులను తీసుకొని పారిపోయారు. పట్టుబడిన ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారించగా 1) తాటి ధర్మ ఏ సత్యం, 2) మడకం రాయి ఎర్ర ఏ రమేష్, వీరిద్దరిది పెంక కరాయ గ్రామం, మన్నెంకొండ మండలం, మల్కానగిరి జిల్లా, ఒడిస్సా రాష్ట్రం అని తెలిపినారు. ఎస్ ఐ కే తిరుపతిరావు



పట్టుబడిన వారిని నీ వద్ద బ్యాగులో ఏమున్నదని పారిపోయిన రెండు మోటార్ సైకిల్ వ్యక్తులు ఎవరు అని అడిగారు. పట్టుబడిన వారిద్దరూ మిగతా రెండు మోటార్ సైకిల్ పై ఉన్నవారు పడి వేసిన బ్యాగులో గంజాయి ఉందని అందుకే మమ్మల్ని

మిగతా 2లో

# లంబాడాల ఎస్టీ హోదాను రద్దు చేయాలి

**-ఐటీడీ ఏ ముట్టడికి తరలి రావాలి**

**-జాక్ చైర్మన్ పూనెం శ్రీనివాస్**

**టీ మీడియా, అక్టోబర్27, ములుగు బ్యూరో :**ములుగు జిల్లా లంబాడాలకు ఎస్టీ హోదా కల్పించడం వల్ల ఆదిమ తెగలకు చారిత్రాత్మక మైన అన్యాయం జరిగిందని తెలంగాణ ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ పూనెం శ్రీనివాస్ ఆరోపించారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలిగించాలని కోరుతూ నవంబర్ 3 న ఏటూరునాగారం ఐటీడీ ఏ ముట్టడి కార్యక్రమం ఉందని చైర్మన్ పూనెం శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగంగా వెంకటాపురం మండల కేంద్రం లోని కాఫెడ్ గ్రౌండ్ లో అన్ని సంఘాల ముఖ్య నాయకుల తో కొర్స నర్సింహా మూర్తి అధ్యక్షతన సమావేశం సోమవారం ఏర్పాటు చేసారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వలస కులాలాలను ఆదిమ తెగల్లో అక్రమంగా కలపడం దుర్మార్గమైన చర్య అన్నారు. యాభై ఏళ్లుగా ఆదివాసీలు విద్యా ఉద్యోగాలు కోల్పోయి ఎంతో వెనకబాటు తనానికి గురైనట్టు ప్రజలకు తెలిపారు. ఏ మాత్రం ఆదిమ లక్షణాలు లేని వలస కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడం పైన ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలిగించే అంతవరకు పోరాటం ఆపొద్దని అన్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమానికి ప్రతి గూడెం తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో జాక్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ వట్టం ఉపేందర్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఊకె రవి, జాక్ లీగల్ అడ్వైజర్ కంతి కుమార స్వామి, జాక్ రాష్ట్ర కో-కన్వీనర్ లు పూనెం రాంచందర్, ఏ ఎన్ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు, జాక్ సలహాదారు కొర్స వెంకటేశ్వర్లు, లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింత సమ్మయ్య, పర్శిక సతీష్, సోమరాజు, కబ్బాక శ్రవణ్, కుంజ మహేష్, నారాయణమ్మ, రామలక్ష్మి, ముర్రం రాజేష్, తదితరులు పాల్గొన్నారు





## ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

## ఎమ్మెల్యే కోరం కనకయ్య

**టీ మీడియా, అక్టోబర్ 27, కామేపల్లి:**గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిరంతరం వైద్యులను సంప్రదించాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. మండలంలోని మద్దులపల్లి గ్రామంలో సోమవారం క్రిస్టియన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే వైద్యుల తో పలు పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ లో అంటు వ్యాధులు పొంచి ఉంటాయని చెప్పారు. తమ ప్రభుత్వం వైద్యాన్ని పేద ప్రజల ముంగిటికీ తీసుకురావడానికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## ఉద్యోగులందరూ నిబద్ధతతో పని చేయాలి

**-జీఎం శాలెం రాజు**

**టీ మీడియా,అక్టోబర్ 27,రామవరం :** సింగరేణి ఉద్యోగులందరూ నీతి, నిజాయితీ, నిబద్ధతతో పని చేయాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శాలెం రాజు అన్నారు. సంస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, సత్ప్రవర్తన పెంపే లక్ష్యంగా సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థలో అక్టోబర్ 27 నుండి నవంబర్ 02వ తేదీ వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం నిర్వహించిన చేపట్టిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. సింగరేణిలో ఐటి ఆధారిత సిస్టమ్స్ ద్వారా అవినీతికి తావులేకుండా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అలాగే కొత్తగూడెం ఏరియాలో ప్రతి ఒక్కరూ లాలూచి పడకుండా, కచ్చితమైన నియమ నిబంధనలు పాటిస్తూ అవినీతి నిర్మూలనకు కృషి చేస్తూ సంస్థ పురోగాభివృద్ధికి పాటుపడాలని కోరారు. ప్రతీ ఫైల్ ను కూడా అలసత్వంతో ఆలస్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత డిపార్ట్మెంట్ అధికారులను ఆదేశించారు. కొత్తగూడెం ఏరియాని అవినీతి రహిత ఏరియాగా తీర్చిదిద్దాలని, అందుకు అందరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రతి సంస్థకు ఉత్పత్తి, లాభాలు, భద్రత, సంక్షేమంతో పాటు సంస్థలో ఎటువంటి అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా అవినీతి రహితంగా విధులు నిర్వహించడం అత్యంత ముఖ్యమైన అంశమని అందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు.జాగరూకత : మా భాగస్వామ్య బాధ్యతఅనునది ఈ సంవత్సర విజిలెన్స్అవగాహన వారోత్సవాల నినాదమని తెలిపారు. ఈ సందర్భంగా డిజిఎం (పర్సనల్) జి.వి. మోహన్ రావు ఉద్యోగులందరిచే అవినీతి నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. అదే విధంగా కొత్తగూడెం ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్మెంట్లలో ఆయా గనుల మేనేజర్లు, అధిపతులు ఉద్యోగులందరిచే అవినీతి నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ యూనియన్ ప్రతినిధి ఉమాయిన్, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ.రజాక్, ఎస్ఓటు జిఎం జి.వి.కోటిరెడ్డి, ఇతర విభాగాల అధిపతులు, అధికారులు, జీఎం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన మద్యం దుకాణాల డ్రా

నిర్వహించామని తెలిపారు. అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు లాటరీ విధానంలో డ్రా నిర్వహించామని, ప్రతి దశలోనూ మానవీయ జోక్యం లేకుండా ప్రక్రియను పూర్తిచేశామని పేర్కొన్నారు.కార్యక్రమం మొత్తం సీసీటీవీ పర్యవేక్షణలో, వీడియో రికార్డింగ్‌తో, ఎల్ఈడి స్క్రీన్ ద్వారా ప్రజల సమక్షంలో స్పష్టమైన నియమ నిబంధనల ప్రకారం నిర్వహించబడిందని తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన డ్రా కార్యక్రమం మధ్యాహ్నం 2 గంటలకు ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ వివరించారు.జిల్లాలో మొత్తం 3922 దరఖాస్తులు అందగా, 88 దుకాణాల లైసెన్సులు కేటాయించబడ్డాయని కలెక్టర్ వెల్లడించారు. మండలాల వారీగా లైసెన్సుల వివరాలను అధికారికంగా ప్రకటించారు. ఎంపికైన అభ్యర్థులు నిర్దేశిత కాలవ్యవధిలో లైసెన్స్ ఫీజులు చెల్లించి, షాపుల స్థాపనకు సంబంధించిన తదుపరి చర్యలు పూర్తి చేయాలని సూచించారు.మద్యం విక్రయం విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన నియమాలు, సమయాలు, పరిమితులు తప్పనిసరిగా పాటించాలని, వాటిని ఉల్లంఘించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎక్సైజ్ శాఖ ప్రధాన లక్ష్యం ఆదాయం సమీకరణతో పాటు మద్యం నియంత్రణలో చట్టబద్ధమైన పద్ధతులను పాటించడం అని కలెక్టర్ పేర్కొన్నారు. అనుమతి లేకుండా మద్యం విక్రయించే అక్రమ దుకాణాలు, బెల్ట్ షాపులు, నకిలీ మద్యం తయారీ కేంద్రాలపై ప్రత్యేక దాడులు, సర్వేలు కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు కూడా సామాజిక బాధ్యతతో ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై అధికారులకు సమాచారం అందించాలని కోరారు.డ్రా కార్యక్రమం ఎటువంటి గందరగోళం లేకుండా, సమగ్రమైన ఏర్పాట్లతో ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో అభ్యర్థులు, అధికారులు,సిబ్బందిఅందరూసహకరించినందుకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహమాన్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్డెంట్ కరంచంద్ మరియు సంబంధిత శాఖాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రైతులందరికీ పాస్ పుస్తకాలు ఇవ్వాలి.

**- మాదినేని రమేష్**

**టీ మీడియా, అక్టోబర్ 27 ,కొణిజర్ల:**

కొణిజర్ల మండల కేంద్రంలో సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పత్తి పెసర పంటకు ఎకరానికి 50వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని కొణిజర్ల ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్ జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ హాజరైనారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి పత్తిని సిసిఐ మార్కెట్ ద్వారా కొనుగోలు జరపాలని కింటా కు పదివేల రూపాయలు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు . అనంతరం ఎమ్మార్వో వినతి పత్రం అందజేశారు అదేవిధంగా భూభారతిలో దరఖాస్తు చేసిన రైతులందరికీ పాస్ పుస్తకాలు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి చెరుకుమల కుటుంబరావు, పార్టీ సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య,చింత నిప్పు చలపతిరావు, దొడ్డపనేని కృష్ణార్జున రావు , కట్టా రాంబాబు, చింత నిప్పు నరసింహారావు, చల్లా నారాయణ, ధారగాని రాములు, మాధవరెడ్డి, బోయినపల్లి శ్రీనివాసరావు,అన్నారపు వెంకటేశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ(ఎం) సానుభూతిపరురాలు రాములమ్మ మృతి

**నివాళ్లు అర్పించిన నాయకులు**



**టీ మీడియా, అక్టోబర్ 27, సింగరేణి (కారేపల్లి) :** సీపీఐ(ఎం) సానుభూతిపరురాలు చీమలపాడు కి చెందిన చెవుల రాములమ్మ(68) సోమవారం మృతి చెందారు. సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు రాచబంటి పుల్లయ్య అత్తగారైన రాములమ్మ వయోభారంతో బాధపడుతున్న ఆమె తుదిశ్వాస విడిచారు. మృతదేహాన్ని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, మండల కార్యదర్శి కే.నరేంద్ర సందర్శించి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చీమలపాడు ప్రాంతంలో భూస్వాములకు వ్యతిరేకంగా,పోడు సమస్య, కూలి పెంపు పై జరిగిన పోరాటాలలో సీపీఐ(ఎం) కు అండగా ఉంటూ రాజీ లేకుండా వ్యవహరించారని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ(ఎం) నాయకులు రాచబంటి పుల్లయ్య, మద్దెల నాగయ్య, మన్నెం బ్రహ్మయ్య, ఎర్రిపోతు భద్రయ్య,యనమనగండ్ల రవిబాబు, అజ్మీర శోభన్ బాబు, వల్లబోయిన కొండలరావు, భూక్య శ్రీను, మాలోతు హనుమ, వాంకుడోత్ రామకోటి తదితరులు పాల్గొన్నారు.

## .చెరువులో పురుగుమందు కలిపిన దుండగులు

**రూ.10 లక్షల నష్టం**



**టీ మీడియా, అక్టోబర్ 27, సింగరేణి (కారేపల్లి) :** కారేపల్లి మండలం మాధారం చెరువులో గుర్తుతెలియని వ్యక్తులు పురుగుమందు కలిపిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. దీనికి సంబంధించి మత్స్యకారులు సోమవారం కారేపల్లి పోలీసులకు పిర్యాదు చేశారు. మత్స్యకారులతో పడని వారు ఈ దుర్ఘటనకు పాల్పడి ఉంటారని బాధితులు తెలిపారు. చెరువులో చేపలు మృతితో రూ.10లక్షలు నష్టం వాటిల్లినట్లు వారు పేర్కొన్నారు. బాధితుల పిర్యాదు మేరకు కారేపల్లి ఎస్సై బైరు గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## గేటుకారేపల్లి సమస్యలపై ప్రజావాణిలో వినతి

**టీ మీడియా, అక్టోబర్ 27, సింగరేణి (కారేపల్లి):** కారేపల్లి మండలం గేటుకారేపల్లిలో వీధిల్కైట్లు, డ్రైనేజీ సమస్యపరిష్కారించాలని కోరుతూ డీవైఎఫ్ఐ గ్రామ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. రాత్రి సమయంలో వీధి లేట్లు లేక పోవటంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు జరుగుతున్నాయని వినతిలో తెలిపారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేక పోవటంతో వర్షపు నీరు ఇండ్లలో నిల్వ ఉండి వ్యాధులకు కారణమవుతుందని తెలిపారు. గేటుకారేపల్లిలో సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో పీ. శ్రీనినాసరావు, తహసీల్దార్ అనంతుల రమేష్ లను కోరారు. ఈకార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆదెర్ల వినయ్‌కుమార్, నాయకులు గడ్డం దిలీఫ్, కాకాటి పృధ్వి తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగంతో యువత పెడదారులు

**టీ మీడియా, అక్టోబర్ 27, సింగరేణి (కారేపల్లి):** యువతకు ఉద్యోగ ఉపాధి చూపాల్సిన పాలకులు ఆ దిశగా ఆలోచించక పోవటంతో నిరుద్యోగంతో విసుగు చెందిన యువత పెడదారులు పట్టుతున్నారని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సత్తెనపల్లినరేష్, జిల్లా కార్యదర్శి బడ్డు మధు, సహాయకార్యదర్శి ఆదెర్ల వినయ్‌లు అన్నారు. సోమవారం గేటుకారేపల్లిలో ఆదెర్ల వినయ్ ఆధ్వర్యలో యువకులు డీవైఎఫ్ఐలో చేరారు. వీరికి డీవైఎఫ్ఐ నాయకులు సంఘ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ యువతకు విద్యా, ఉద్యోగం, ఉపాధి కోసం డీవైఎఫ్ఐ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. దేశభక్తి గల సంఘంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతను చైతన్యం చేయటంలో ముందుందన్నారు.

**గేటుకారేపల్లి గ్రామ కమిటీ ఎన్నిక**

గేటుకారేపల్లిలో డీవైఎఫ్ఐ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కుంట విజయ్, కార్యదర్శిగా కాకాటి పృధ్వి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ నాగుల్ పాషా మండల కార్యదర్శి ఆదెర్ల వినయ్ కుమార్, నాయకులు వేపె వంశీ, మేకల బాబు, చెంచు ఈశ్వర్, నాగవరపు చందు, ఉప్పెల అఖిల్, పెరిక ప్రేమ్ కుమార్, బాణాలపల్లి చందు, మర్రి రాకేష్, విష్ణు పాల్గొన్నారు.

## గంజాయి విక్రేతలు అరెస్టు

పట్టుకోగానే వారు పారిపోయారని తెలిపారు. పోలీసు వారు వారిని విచారించగా వీరిద్దరూ(గ్రామం దుప్పలకొండ3) దూరం దుర్గయ్య (గ్రామం దుప్పలకొండ,4) సోడి జోగాఏజోగయ్య, సాధ్యానపల్లి గ్రామం, అని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా నలుగురు వ్యక్తులు రహస్యంగా గంజాయి ప్రభుత్వం చేత నిషేధించబడినది అని తెలిసిన గంజాయి వ్యాపారం చేస్తూ అక్రమ సంపాదన చేస్తుంటారని తెలిపారు. వీరిపైన ఎన్డిపిఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి పట్టుబడిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచడం జరుగుతుందని తెలిపారు. ఆర్పిఎల్ నేరస్తులను పట్టుకోవడం కోసం ఒక టీంలు ఏర్పాటు చేసి పంపించడం జరుగుతుందని సమాచారం రాగానే సత్వరంగా స్పందించి నేరస్తులను పట్టుకున్న వెంకటాపురం పోలీసులను అభినందించినట్లు తెలిపారు.



# అసాంఘికలకు పాల్పడితే కఠిన చర్యలు

**-డీఎస్పీ చంద్రభాను**

**టీ మీడియా,అక్టోబర్ 27,ఇల్లెందు :** అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. సోమవారం ఇల్లెందు పట్టణం కొత్త కాలనీలో చైతన్యం -డ్రగ్స్ పై యుద్ధంలో భాగంగా ఇల్లెందు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఇల్లెందు పోలీస్ స్టేషన్ పరిధిలోని జెకె కాలనీ ఉన్న కొత్త కాలనీలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం సుమారుగా వంద ఇండ్లలో సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేకుండా నంబర్ ప్లేట్లు లేని 60 ద్విచక్ర వాహనాలను,10 ఆటోలను వెరిఫై చేసి పంపారు. ఐదు బైకులు సీజ్ చేశారు. అనంతరం కాలనీ వాసులతో సమావేశం ఏర్పాటు చేసిన డీఎస్పీ మాట్లాడారు. మట్కా, జూదం, బెట్టింగ్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడమైనదని తెలిపారు.అదే విధంగా చైతన్యం పేరుతో చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా యువత డ్రగ్స్ మహమ్మారిన పడకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్ధాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం వెల్లడించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాల నియంత్రణ కొరకు తమ నివాస ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు తాటిపాము సురేశ్, బత్తుల సత్యనారాయణ, ఎల్.రవీందర్, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.



# పారిశుధ్యం అస్తవ్యస్తం..

**-పట్టని అధికారులు**

**టి మీడియా,అక్టోబర్ 27, కోదాడ :** మేజర్ గ్రామ పంచాయతీ నుండి మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన కోదాడ పట్టణ పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. సందు గొందులలో చెత్త పేరుకుపోయి మురుగు కంపు కొడుతున్నప్పటికీ అధికారులకు మాత్రం చీమ కుట్టినట్లైనా లేదని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. ఆయా కాలనీలోని ప్రజలు పారిశుధ్యంపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం మాత్రం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడే పాలన బాగుందని, ఇప్పుడు మాత్రం చెత్త పాలన సాగుతుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

65వ జాతీయ రహదారిపై ఉన్న కోదాడ పట్టణం 80 వేల జనాభాతో వేగంగా అభివృద్ధి చెందుతుంది. వర్తక, వ్యాపార, వాణిజ్య, విద్య, వైద్య రంగాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ పరిణామంలో మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న కోదాడ పట్టణం మున్సిపాలిటీగా రూపాంతరం చెందినప్పటికీ పాలనలో మాత్రం ఆరడుగుల వెనక్కు వెళ్లిందని పట్టణ ప్రజలు బహిరంగ విమర్శిస్తున్నారు. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడే పట్టణ పారిశుధ్యం బాగా ఉండేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు మాత్రం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా ఉందని ఏ కాలనీ, వీధులు, సందుల్లో చూసినా చెత్త పేరుకుపోయి మురుగు కంపు కొడుతుందని, పారిశుధ్య లోపంతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారానికి ఒకసారి కూడా కాలనీలకు చెత్తను సేకరించే వాహనం దర్శనం ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.



# ఏసీబీకి చిక్కిన గ్రామ పరిపాలన అధికారి

**-వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ నిమిత్తం రూ.60వేలు డిమాండ్**

**-ముందుగానే రూ. 40వేలు చెల్లించిన రైతు**

**-మిగిలిన రూ.15వేలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ**

**టీ మీడియా,అక్టోబర్ 27, ములకలపల్లి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రామ పరిపాలన అధికారి (జీపీవో) లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం ములకలపల్లి తహసీల్దార్ కార్యాలయంలో దాడులు నిర్వహించింది. ఈ గ్రామ పరిపాలన అధికారి బానోత్ శ్రీనివాస్ నాయక్ పూసుగూడెంకు చెందిన ఓ రైతు వద్ద వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్, పాసుబుక్ ఇప్పిస్తానని చెప్పాడు. ఆ పని చేసిపెట్టడానికి మొత్తం రూ.60 వేలు లంచం డిమాండ్ చేశాడు. ముందుగా రూ.40వేలు తీసుకున్నాడు. ఈ విషయాన్ని రైతు ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా సోమవారం మిగిలిన బ్యాలెన్స్ రూ.15 వేలు బానోత్ శ్రీనివాస్ నాయక్ తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. పట్టుబడిన శ్రీనివాస్ నాయక్ గతంలో బూర్గంపాడు మండలంలో వీఆర్వోగా పనిచేశాడని, ఆ సమయంలో కూడా ఇతను పలు అవినీతి, ఆరోపణలు ఎదుర్కొన్నట్లు సమాచారం. ఏసీబీ అధికారులు ఇతనిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ పరిపాలన అధికారి అయ్యప్ప దీక్షలో ఉండగా లంచం తీసుకోవడంతో మండలంలో ఈ వార్త సంచలనంగా మారింది.

ఏసీబీ డీఎస్పీ వై.రమేష్



మాట్లాడుతూ బానోత్ శ్రీనివాస్ వ్యవహారంలో పై అధికారుల పాత్ర ఏమైనా ఉన్నదా అనే కోణంలో విచారిస్తున్నామని తెలియజేశారు. అలాగే ఎవరైనా అధికారులు లంచం అడిగితే 1064 నెంబర్‌కు ఫోన్ చేయగలరని చెప్పారు. మీ వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు.

# అంతర్రాష్ట్ర బస్ సర్వీస్ ప్రారంభం

**ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**

**టి మీడియా,అక్టోబర్ 27, అశ్వారావుపేట:** ప్రజా క్షేమమే పరమావధిగా కాంగ్రెస్ పాలన సాగుతుందని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. సోమవారం ఆయన మండలంలో పర్యటించారు. తెలంగాణ ఆర్టీసీ సత్తుపల్లి డిపో నుండి అశ్వారావుపేట మీదుగా ఆంధ్రప్రదేశ్,వెలేదుపాడు వరకు నడిపే ఆర్డినరీ బస్ సర్వీస్ ను ఆయన అశ్వారావుపేట లో సంస్థ జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా ఆయన ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణం లో ఉపాధి కూలీలకు గునపం,మట్టి తట్ట పనిముట్లు ను పంపిణీ చేసారు.కూలీలు తక్కువ కష్టంతో ఎక్కువ పని చేయగలిగేలా ఈ పనిముట్లు ఉపయోగపడతాయని తెలిపారు.కూలీల కష్టానికి విలువ ఇవ్వడం వారికి సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. బస్సును ప్రారంభించిన అనంతరం ఆయన ప్రయాణికులతో కలిసి బస్సులో ప్రయాణం చేశారు. ప్రజలకు రవాణా సౌకర్యం కోసం నియోజకవర్గ వ్యాప్తంగా అవసరం ఉన్న చోట ఇలాంటి సర్వీసులు మరిన్ని ప్రారంభిస్తామని తెలిపారు. తర్వాత ప్రముఖ ఫోటో గ్రాఫర్ కేశిబోయిన వీరాంజనేయులు %-% రమాదేవి దంపతుల కుమార్తె చదరంగంలో జాతీయ స్థాయికి ఎంపికైన నేపథ్యంలో విద్యార్థిని భవ్యశ్రీ లక్ష్మి ని ప్రత్యేకంగా అభినందించి మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి సహాయ సహకారాలు అందిస్తామని బరోసా ఇచ్చారు.గుమ్మడవల్లి కొత్తూరు ల్లో ఇటీవల




ఐటీడీఏ విభాగంలో అశ్వారావుపేట నియోజకవర్గానికి అదనంగా కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీ ఆర్టీసీ సత్తుపల్లి డిపో మేనేజర్ ఊటుకూరి సునీత,సహాయ మేనేజర్ విజయ్ శ్రీ,సెక్యూర్టీ హెడ్ కానిస్టేబుల్ రాములు,విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు,స్టేషన్ మేనేజర్ ఆనందం, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మ రాంబాబు, జూపల్లి ప్రమోద్,రేమళ్ళ కేదార్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలతో పంట నష్టం వాటిల్లకుండా జాగ్రత్త

వాహనాల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. మార్కెట్ కు చేరిన పంట అకాల వర్షాలకు తడవకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించామని నిజామాబాద్, ఆదిలాబాద్ ప్రాంతాలలో సోయాబీన్ పంటను కొనుగోలుకు సైతం కేంద్రాలు ఏర్పాటు చేయాలని సంబంధిత కలెక్టర్ లకు మంత్రి తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా రైతుల కల్లాల వద్ద తేమ శాతం పరిశీలించి నాణ్యత ప్రమాణాలు ఉంటేనే కొనుగోలు కేంద్రాలకు పంట తీసుకుని వచ్చేలా చూడాలని అన్నారు. రైతులకు నష్టం కలగవద్దు అని పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని, బోర్డర్ జిల్లాలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి మన దగ్గర పంట అమ్ముకోకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు.సీఎస్ కె. రామకృష్ణారావు మాట్లాడుతూ ధాన్యం, పత్తి, మొక్కజొన్న పంటలను రైతుల దగ్గర నుంచి ప్రభుత్వం మద్దతు ధర అందించి పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తుందని అన్నారు. రాబోయే 45 రోజుల నుంచి 2 నెలల కాలంలో ధాన్యం కొనుగోలు ఉధృతంగా జరగనున్నదని, అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ సజావుగా కొనుగోలు జరిగేలా చూడాలని అన్నారు. రాబోయే 2 నుంచి 3 రోజుల పాటు ఏపిలో వస్తున్న తుపాన్ ప్రభావం మన రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలపై అధికంగా పడే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద పంట నష్టం కాకుండా జాగ్రత్త పడాలని సీఎస్ సూచించారు. వీసీ అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులతో మాట్లాడుతూలి వానాకాలం పంట కోతలు ప్రారంభమై ధాన్యం కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో రైస్ మిల్లర్ల దగ్గరనుంచి బ్యాంకు గ్యారంటీలను సేకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంకు గ్యారంటీలు లేకుండా ధాన్యం అలాట్మెంట్ చేయవద్దని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, ఆర్టీఓ వెంకటరమణ, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ సునీత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫలించిన మంత్రి తుమ్మల కృషి

ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ %+.ఉ అశీ%.747 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు రూపకల్పనతో ఖమ్మం కార్పొరేషన్ ప్రజల కల సాకారం చేసిన అపర భగీరథుడిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖ్యాతి పెరిగింది. ఆయన తపనతో ఈ ప్రణాళిక రూపుదిద్దుకోగా, పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఖమ్మం నగరానికి అద్భుత స్థాయిలో నీటి సరఫరా వ్యవస్థను రూపొందించారు.

**మున్నేరు, పాలేరు నుంచి నీటి సరఫరా**

నగరానికి సంవత్సరమంతా నిరంతరంగా మంచినీరు అందించేలా ప్రణాళిక రూపొందించారు.మున్నేరు నది నుంచి ఎనిమిది నెలలపాటు నీటి సరఫరా జరుగుతుండగా, వేసవి నెలల్లో పాలేరు జలాశయం నుంచి నీరు అందించనున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. ఈ విధంగా రెండు వనరుల ఆధారంగా ఖమ్మం నగరానికి నిరాటంకంగా రక్షిత నీటి సరఫరా జరిగేలా ముందు చూపుతో ప్రణాళికలు చేశారు.

**దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ ద్వారా త్రీ టౌన్ కు నీరు**

గతంలో నగరంలోని త్రీ టౌన్ ప్రాంతాలకు దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ ద్వారా నీటి సరఫరా నిర్వహించబడేది. ఇప్పుడు ఆ వ్యవస్థను మరింత విస్తరించి ఆధునిక సదుపాయాలతో అప్‌గ్రేడ్ చేయనున్నారు.

**ఖమ్మం నగరానికి ప్రధాన వనరుగా లకారం ..**

ఇప్పటివరకు ఖమ్మం నగరానికి ప్రధానంగా లకారం ట్యాంకు నుంచే నీటి సరఫరా కొనసాగుతోంది. అయితే, నగర విస్తరణతో పాటు జనాభా పెరగడంతో ప్రస్తుతం ఉన్న వనరులు పూర్తిస్థాయిలో సరిపోవడం లేదు. దీనికి పరిష్కారంగా కొత్త పైపులైన్ వ్యవస్థలు, ఫిల్టర్‌బెడ్‌లు, పంప్‌హౌస్‌లు నిర్మించే ప్రణాళిక సిద్ధమవుతోంది.

**ఖమ్మం అభివృద్ధికి పునాది**

రక్షిత మంచినీటి సమస్యకు ఈ ప్రాజెక్టు శాశ్వత పరిష్కారాన్ని అందించడమే కాకుండా, భవిష్యత్‌లో ఖమ్మం నగర అభివృద్ధికి పునాది వేయనుంది. మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణలో కూడా ఈ ప్రణాళిక కీలక పాత్ర పోషించనుంది.

**మంత్రి తుమ్మల సంకల్ప ఫలితం**

గతంలో మంత్రిగా ఉన్నప్పటి నుంచే ఖమ్మం నగర అభివృద్ధి పట్ల తుమ్మల నాగేశ్వరరావు గారు చూపిన చిత్తశుద్ధి, నిరంతర కృషి ఈరోజు ఫలితాలుగా మారాయి. ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని తీర్చే దిశగా ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకోవడం పట్ల నగర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి తుమ్మల చూపిన చొరవ, కృషి ఫలితంగా కాంగ్రెస్ సర్కారు 200 కోట్లు కేటాయించిందని, ఖమ్మం నగర ప్రజలు గౌ. ముఖ్య మంత్రికి మరియు మంత్రి తుమ్మల గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.